
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



శ్యాంపిత్రోడాపై ప్రత్యేక కోర్టులో కేసు

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఓవర్సీస్ విభాగం అధ్యక్షుడు శ్యాంపిత్రోడాపై బెంగళూరు భూ ఆక్రమణల నియంత్రణ ప్రత్యేక న్యాయస్థానంలో సోమవారం కేసు నమోదైంది. బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ ఎన్ఆర్ రమేశ్ ఆయనపై ఫిర్యాదు చేశారు. ఎఫ్ఆర్ఎల్‌హెచ్‌టీ పేరిట ముంబైలో రిజిస్ట్రేషన్ అయిన సంస్థకు యలహంకలో ఐదు హెక్టార్లు (12.35 ఎకరాల) అటవీ రిజర్వుభూమిని అప్పగించారని ఆయన ఆరోపించారు. కోర్టులో ఆయన పిటిషన్ వేయడంతో కేసు నమోదు చేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కన్నుల పండువగా ఖాద్రీశుడి కల్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన ఏపీ మంత్రి నారా లోకేశ్

కదిరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో శ్రీదేవీ, భూదేవీ సమేత ఖాద్రీశుడి కల్యాణోత్సవం సోమవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ప్రభుత్వం తరఫున మంత్రి నారా లోకేశ్ స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. యాగశాలలో కొలువుదీరిన వధువులు శ్రీదేవి, భూదేవిని, వరుడు శ్రీవారి ని వేర్వేరుగా పల్లకిలలో కల్యాణ మంటపానికి చేర్చారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ శ్రీవారి ప్రతిరూపంగా విచ్చేసిన కంకణ భట్టాచార్యులు అమ్మవార్లకు సోమవారం రాత్రి 10.07 గంటలకు మాంగళ్య ధారణ గావించారు. కల్యాణోత్సవం ముగిసిన తరువాత శ్రీవారు, అమ్మవార్లపై నుంచి జాలువారిన ముత్యాల తలంబ్రాలను దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి వేడుకను తిలకించారు. కల్యాణోత్సవం తరువాత శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి భక్తులు కానుకలను చదివించుకున్నారు. వేడుకలలో ఆంధ్రప్రదేశ్ దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఈఓ శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, ఆర్డీఓ వీవీఎస్ శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తరపున..

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున మంత్రి నారా లోకేశ్ పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ముఖద్వారం నుంచి నారా లోకేశ్ పట్టువస్త్రాలను తీసుకువచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి సమర్పించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీక్షించి, వేదపండితుల ఆశీస్సులు అందుకున్నారు. వేదపండితులు వసంత వల్లభుడికి నారా లోకేశ్‌తో సంకల్పం చేయించారు. ఆయన వెంట రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ తదితరులు ఉన్నారు. పట్టువస్త్రాలు సమర్పించేందుకు వచ్చిన లోకేశ్‌కు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కల్యాణోత్సవానికి విజయవాడ నుంచి ఆయన ప్రత్యేక విమానంలో సోమవారం సాయంత్రం పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ముదిగుబ్బ మీదుగా కదిరికి రోడ్డు మార్గాన చేరుకున్నారు. గ్రామాల్లో అడుగడుగునా ఆయనకు ఘన స్వాగతం లభించింది. కల్యాణోత్సవం అనంతరం ఆయన కడప ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. మంత్రి నారా లోకేష్‌కు పుట్టపర్తి నుంచి కదిరి వరకూ అడుగడుగునా ప్రజలు నీరాంజనలు పట్టారు. బాణసంచా పేలుస్తూ, పూలవర్షం కురిపించారు. లోకేశ్‌తో కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. అక్కడక్కడ వాహనాన్ని ఆపుతూ లోకేశ్ వారితో మాట్లాడారు. సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు.



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి నారా లోకేశ్



విభజన విడ్డూరం..!



సభలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రతిపక్షనేత అశోక్

- బెంగళూరును ఏడు పాలికెలుగా విభజించడం తగదు
- నగర ప్రతిష్టను దిగజార్చవద్దు
- ఢిల్లీ లాంటి మహానగరాలనే పాలిస్తున్నారు..
- సభలో పాలకవర్గంపై ప్రతిపక్షాల ఆగ్రహం
- సమగ్ర చర్చ తర్వాతే నిర్ణయం : డీకే



సభ్యులకు సమాధానమిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'గ్రేటర్ బెంగళూరు అథారిటీ' బిల్లును బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రవేశపెట్టారు. గ్రేటర్ బెంగళూరు అవసరాలను వివరించారు. శాసనసభలో సోమవారం బిల్లుపై ప్రతిపక్ష పార్టీల సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ నాడప్రభు కెంపేగౌడ దూరదృష్టితో బెంగళూరును నిర్మించారన్నారు. నాలుగువైపులా గోపురాలు, 16 పేటల ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతంలో నగరం అభివృద్ధి చెందాలనేది ఆయన ఆశయమన్నారు. కెంపేగౌడ ఆలోచనలకు అనుగుణంగా బెంగళూరు విశ్వంలోనే పేరొందిన నగరంగా ఏర్పడిందన్నారు. డీసీఎం డీకే శివకుమార్ తండ్రి, తాత ముత్తాలు కెంపేగౌడ పేరు పెట్టుకున్నారని, అటువంటి తరంలో వచ్చి కెంపేగౌడ ఆశయాలను నాశనం చేసేలాంటి నిర్ణయం సరికాదన్నారు. 2006లో బీబీఎంపీ ఏర్పడిందన్నారు. గ్రేటర్ బెంగళూరులో 7 పాలికెలు చేయాలని నిర్ణయించారన్నారు. ఇప్పుడే కన్నడిగుల ప్రభావం నగరంలో తగ్గుతోందన్నారు. భవిష్యత్తులో పాలికెలు పెరిగితే కన్నడిగులు మేయర్లు కాలేరన్నారు. బెంగళూరు తూర్పు విభాగంలో ఐటీ కంపెనీలతో ఆదాయం ఎక్కువని, ఇదే పరిస్థితి బెంగళూరు దక్షిణ, కేంద్ర పరిధిలో లేవన్నారు. ఆరేడు పాలికెలు చేయాలనుకుంటే ఏం పేర్లు పెడతారన్నారు. తెలంగాణలో రంగారెడ్డి పేరిట ఓ జిల్లా ఉందని, అలా నిర్ణయిస్తే కెంపేగౌడ ఆశయానికి తూట్లు పొడిచినట్టే అన్నారు. బెంగళూరుకు మాత్రమే ఎందుకు గ్రేటర్ అని మంగళూరు, మైసూరు, కలబురగిలను ఎందుకు విభజించరన్నారు. దేశం సువిశాలమైనదని, ఇద్దరు ప్రధానమంత్రులను చేసేందుకు సాధ్యమా..? అని ప్రశ్నించారు. 224 నియోజకవర్గాలకు ఒకే సీఎం ఉండవచ్చునని, ఒక నగరానికి ఒక మేయర్‌తో పాలన ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. ఢిల్లీని మూడుగా విభజించి ఆ తర్వాత ఒక్కటి చేశారన్నారు. కెంపేగౌడ పేరు ఉండాలనేది అందరి ఆశయమని, గ్రేటర్ తెరపైకి వస్తే కెంపేగౌడ పరుగెత్తినట్లే అన్నారు. కెంపేగౌడకు ఎందుకు అన్యాయం చేస్తారని ప్రశ్నించారు. విడగొట్టడం సులభమని, అయితే మళ్లీ ఐక్యం చేయలేరన్నారు. 40వేల కోట్ల రూపాయలతో సొరంగమార్గం చేయాలనుకున్నారని, మరో 20ఏళ్లు అయినా శంకుస్థాపన చేయలేరన్నారు. పాలనాపరంగా ఎన్ని చర్యలైనా తీసుకోవచ్చునని, ఎంతమంది అధికారులనైనా నియమించుకోవచ్చునని కానీ ఉమ్మడిగా ఉండే బెంగళూరును విభజించరాదన్నారు. బీజేపీ సభ్యులు విశ్వనాథ్, గోపాలయ్య, సీకే రామమూర్తి, అశ్వత్థ నారాయణ, సహా పలువురు గ్రేటర్‌పై చర్చించారు.

కమిటీ నిర్ణయం మేరకే పాలికెలు...

అంతకుముందు డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ బెంగళూరు జనాభా పెరుగుతోందని పాలనాపరంగా పలు సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. నగర విస్తీర్ణం పెరిగిందని, అందుకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాల పర్యవేక్షణతోపాటు ఇతరత్రా సమస్యలు పెరిగాయన్నారు. వాహనాలు అధికం కావడంతో ట్రాఫిక్ పెను సవాల్‌గా మారిందన్నారు. బెంగళూరులో కొన్నేళ్లకాలంగా నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని భావించామన్నారు. ఇందుకోసమే శాసనసభ కమిటీని రిజ్వాన్ అర్షద్ అధ్యక్షతన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సుదీర్ఘమైన చర్చలు, నిపుణులతోపాటు అందరి అభిప్రాయాలు తీసుకున్నాక ఓ నివేదిక సమర్పించారన్నారు. ఇందులో 1నుంచి 7 పాలికెలు చేయాలని సూచించారని, సమగ్రమైన చర్చ తర్వాత అమలు చేయదలిచామన్నారు. పాలికెల్లో వ్యవస్థలో మార్పు లేదన్నారు. పన్నులపై మార్పుపై పరిశీలిస్తామన్నారు. 10లక్షలమంది జనాభాకు ఒక పాలికె చేయాలనేది నిర్ణయమన్నారు. బెంగళూరు పేరుతోనే పాలికెలు ఉంటాయని, మరే ఇతర పేర్లకు అవకాశం లేదన్నారు. అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎమ్మెల్యేల నియోజకవర్గాల మార్పు ఉండదన్నారు. అయితే రెండున్నరేళ్లపాటు మేయర్ పదవీకాలం కొనసాగనుందన్నారు. ఆరు నెలల తర్వాత అవిశ్వాస తీర్మానానికి అవకాశం ఉంటుందన్నారు. సమగ్ర చర్చల తర్వాతనే నిర్ణయం తీసుకుంటామన్నారు. శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లుపై నగర పరిధిలోని ఎమ్మెల్యేలంతా ప్రసంగించాల్సి ఉందని సభ్యులంతా పట్టుబట్టారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకోరాదని, అందరి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

నటించింది ఎవరో..?

- నటి రన్యారావ్‌కు సహకరించిన మంత్రుల పేర్లు బయట పెట్టాలి
- బంగారు అక్రమ రవాణాపై అట్టుడికిన అసెంబ్లీ



సభ్యుడు సునీల్‌కుమార్



హోం మంత్రి పరమేశ్వర్

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ నుంచి బెంగళూరుకు అక్రమంగా కేజీలకొద్దీ బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చిన కేసులో అరెస్టు అయిన నటి రన్యారావ్ వివాదంపై అసెంబ్లీ అట్టుడికింది. బీజేపీ సభ్యుడు సునీల్‌కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయిలో ఓ కన్నడ నటి దుబాయ్ నుంచి బెంగళూరుకు 14 కేజీల బంగారాన్ని తీసుకొచ్చారన్నారు. దీని వెనుక భారీ మాఫియా ఉందన్నారు. హవాలా ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందినవారికి బెంగళూరు అడ్డాగా మారుతోందనే చర్చ ప్రారంభమైందన్నారు. పోలీసులు విమానాశ్రయం నుంచి ప్రోటోకాల్ ద్వారా తీసుకొచ్చేవారంటే, కేవలం నటి రన్యారావ్ ఒక్కరితోనే సాధ్యం కాదన్నారు. ఇటీవల పట్టుబడింది కేవలం 14 కేజీలు మాత్రమేనని 15 రోజుల్లో నాలుగుసార్లు ఒకే డ్రెస్‌లో దుబాయ్ నుంచి రన్యారావ్ వచ్చారంటే మరిన్ని అనుమానాలు ఉన్నాయన్నారు. పోలీస్ జీప్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి రన్యారావ్‌ను ఎందుకు తీసుకొస్తుందన్నారు. పెంపుడుతండ్రి సంబంధం లేదని, ఇటీవల కలవలేదని చెప్పారన్నారు. అంటే ఎవరున్నారనేది బహిరంగం కావాల్సి ఉందన్నారు.

ఇందుకు స్పందించిన హోం మంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ ఈ అంశం కేంద్రప్రభుత్వ పరిధిలోనిదన్నారు. అంతర్జాతీయ విమాన సంస్థలు రాష్ట్రప్రభుత్వ పరిధిలోకి రావన్నారు. ఈ కేసులో స్మగ్లింగ్ కాలేదన్నారు. అయితే బంగారం తీసుకురాలేదని చెప్పలేమన్నారు. పత్రికలు, టీవీల ద్వారా వస్తున్న సమాచారం మాత్రమే ఉందన్నారు. సమగ్ర దర్యాప్తుకోసం సీబీఐ రంగంలోకి దిగిందన్నారు. ఇద్దరుమంత్రుల భాగస్వామ్యం ఉంటే వారిని కూడా విచారిస్తారన్నారు. అంతకుమించి చెప్పలేమన్నారు. ఇదే విషయంలో సభ్యుడు సునిల్‌కుమార్, హోం మంత్రి పరమేశ్వర్‌ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అధికారి కుమార్తెకు పోలీసులు ప్రోటోకాల్ ఎలా ఇస్తారని, పోలీస్ జీప్ ఎలా వాడతారని ప్రశ్నించారు. హోం మంత్రిగా తనకు తెలియదంటూ దాటవేయడం సమంజసమా అన్నారు. ప్రోటోకాల్ పాటించింది రాష్ట్ర పోలీసులు కాదా..? అన్నారు. ఇద్దరి మధ్యా వాగ్వాదం చోటు చేసుకోవడంతో స్పీకర్ జోక్యం చేసుకున్నారు.

రన్యాకు 14 రోజుల రిమాండ్

కాగా రన్యారావ్‌కు కస్టడీకి తీసుకున్న డీఆర్ఐ అధికారులు గడవు ముగియడంతో కోర్టు ముందు హాజరు పరిచారు. 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. పరప్పన అగ్రహార జైలుకు రన్యారావ్‌ను పంపారు. మరోవైపు రంగంలోకి దిగిన సీబీఐ అధికారులు, డీఆర్ఐ బృందాలు చేసిన సోదాల వివరాలను తెలుసుకున్నారు. రన్యారావ్‌కు తుమకూరు జిల్లా పారిశ్రామికవాడలో 12 ఎకరాల భూమికేటాయింపుపై కేఐఏడీబీ అధికారులు స్పందించారు. కేటాయింపు జరిగిందని, వారు ఇంకా పూర్తిస్థాయిలో సొమ్ము చెల్లించలేదన్నారు. మరోవైపు సదరు భూమిని వాపసు తీసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

ఆ ఇద్దరు మంత్రులు ఎవరో... ?

రన్యారావ్ బంగారం అక్రమ రవాణా వెనుక ఇద్దరు కీలక మంత్రులు ఉన్నారనే చర్చలు జోరందుకున్నాయి. నగర పరిధికి చెందిన ఇద్దరు మంత్రులు ఉన్నారనే విషయమై విధానసౌధలో హాట్‌టాపిక్‌గా చర్చ జరిగింది. లాంజ్‌లలో ఇదే అంశం కీలకంగా మారినట్లు సమాచారం. బంగారు అక్రమరవాణాపై అధికార పార్టీ ఇరుకున పడింది.



నేడు బళ్లారి కనక దుర్గమ్మ

సిడి బండి ఉత్సవం

బళ్లారి సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): వేలాది భక్తుల మధ్య, అంగరంగ వైభవంగా నిర్వహించే భక్తుల ఆరాధ్య దైవత బళ్లారి కనక దుర్గమ్మ సిడి బండి ఉత్సవాలు మంగళవారం నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ఆలయ కమిటీ దేవదాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భకుల్త రద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేపట్టినట్లు కమిటీ ప్రకటించింది. సోమవారం సాయంత్రం 5గంటలకు కౌల్‌బజార్ దుర్గి మాదవయ్య గాణిగుల వీధి నుంచి మూడు జతల ఎద్దులతో సిడి బండి మోసుకెళ్లి కౌల్‌బజార్ మెయిన్‌రోడ్డు, ఏళుమక్కల తాయి, బసవనకుంట, ఎస్పీ సర్కిల్, పార్వతి నగర్ మెయిన్ రోడ్డు నుండి వేలాది మంది భక్తులతో దుర్గమ్మ వీధికి చేరుకుంది.. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మూడు జతల ఎద్దులతో సిడి బండిని తీసుకొస్తున్న భక్తులు

వైభవంగా వీరభద్రేశ్వరస్వామి మహారథోత్సవం

- భారీగా తరలి వచ్చిన భక్తులు

8

హంపిలో విచ్చలవిడిగా మాదకద్రవ్యాలు



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరీ
6.46	5.18
మంగళవారం సాయంత్రం	బుధవారం ఉదయం

న్యూస్ బాక్స్

బీసీల అభివృద్ధే చంద్రబాబు శ్వాస

● అసెంబ్లీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



హిందూపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీసీల అభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్వాస అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా బీసీల అభ్యున్నతికి పెద్ద పీట వేస్తున్నామన్నారు. అసెంబ్లీలో సోమవారం మంత్రి సవిత మాట్లాడారు. బీసీల అభివృద్ధికి ఎన్నడూలేనంతగా బడ్జెట్‌లో రూ.33.878.45 కోట్లు కేటాయించినందుకు సీఎం చంద్రబాబునాయుడుకు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కి ధన్యవాదాలు అన్నారు. బీసీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధికి ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. స్వయం ఉపాధి పథకాల అమలు చేస్తున్నామన్నారు. సీఎస్ సహా కీలక పోస్టుల్లో బీసీలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. బీసీ పిల్లల విద్య కోసం అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేశామన్నారు. త్వరలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో 26 జిల్లాల్లోనూ ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లను నిర్వహిస్తామని చెప్పారు. మహిళలు, ఇతరుల కోసం ఆన్‌లైన్ శిక్షణ ఇస్తామన్నారు. సివిల్ సర్వీసెస్‌కు కోచింగ్ ఇప్పిస్తామన్నారు. టీడీపీకి దక్కిన మూడు ఎమ్మెల్సీలను బడుగుబలహీన వర్గాలకు కేటాయించడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో బీసీలపై జరిగిన దాడులపై మండిపడ్డారు. గత ప్రభుత్వంలో బీసీలు, ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులపై తప్పుడు కేసులు బనాయించి, వేధించారన్నారు. 200 మందికి పైగా బీసీలు హత్యకు గురయ్యారనీ, 2600 మందిపై అక్రమ కేసులు పెట్టారని మండిపడ్డారు. ఒక్కచాన్స్ అంటూ బడుగుబలహీన వర్గాలతో ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చిన జగన్ బీసీ బిడ్డలను అన్నివిధాలా అణగదొక్కారని మంత్రి సవిత మండిపడ్డారు.

బీసీ హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించండి

● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం, మార్చి10(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో సోమవారం ఆమె మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ వసతిగృహాలు, పాఠశాలలు అధ్వానస్థితికి చేరాయన్నారు. గత పాలకులు నిర్లక్ష్యం కారణంగా పేద విద్యార్థులకు సరైన వసతులు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.47వేల కోట్లు నిధులు కేటాయించి వారి అభివృద్ధికి తోడ్పాటు నందించిందన్నారు. గతంలో బీసీల విద్యార్థుల కోసం పాఠశాలలు, వసతిగృహాలు ఏర్పాటు చేశారన్నారు. అందులో భాగంగానే రాప్తాడు నియోజకవర్గంలోని ననసకోటసమీపంలో గత టీడీపీ ప్రభుత్వంలో ఎంజేపీ బాలికల పాఠశాల నిర్మించి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపారన్నారు. ప్రస్తుతం ఆ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఆమె ధన్యవాదాలు తెలిపారు. అయితే జిల్లాలోని బీసీ వసతిగృహాలు, ఎంజేపీ, మోడల్ పాఠశాలల్లో విద్యార్థులకు తగినన్ని మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెన్నేకొత్తపల్లి బీసీ బాలుర వసతిగృహం, పేరూరు ఎంజేపీ బాలుర పాఠశాల, కనగానపల్లి మోడల్ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. వెనుకబడిన అనంత జిల్లాలో పేద విద్యార్థులు చదువుకునేందుకు సౌకర్యాలు కల్పించాలన్నారు. బీసీలకు ఇస్తున్న సబ్సిడీ రుణాల సంఖ్యను మరింత పెంచాలని కోరారు. అసెంబ్లీలో తాను ప్రస్తావించిన అంశాలు సూటిగా, స్పష్టంగా ఉన్నాయని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అభినందించారని ఆమె తెలిపారు.

కరెంటు చార్జీలు తగ్గించండి

● ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి



తాడిపత్రి, మార్చి10(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు బాగుపడాలంటే విద్యుత్ చార్జీలు తగ్గించి, రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీలో సోమవారం ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల కిందట తాడిపత్రి నియోజకవర్గంలో సాగు, తాగునీరు ఇబ్బందిలేకుండా మంచి పంటలు పండేవన్నారు. కొంతకాలంగా సాగు, తాగునీరు లేకపోవడంతో పరిశ్రమల స్థాపనకు కృషి చేశారు. కానీ ఈ ప్రాంతంలో రా మెటీరియల్ లేకపోయినా వందల కిలోమీటర్ల దూరం నుంచి తెచ్చి గ్రానైట్, నల్లబండల పరిశ్రమలు స్థాపించి 30వేల నుంచి 40వేల వరకు కార్మికులకు ఉపాధి కల్పించేవారు అన్నారు. దాదాపు 1800 పరిశ్రమలు ఉండేవని వాటి వల్ల నియోజకవర్గంలోని ప్రజలు, వ్యాపారస్తులు బాగుండేవారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు పెంచడం, రాయితీలు తగ్గించడంతో అనేక పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. దీనివల్ల దాదాపు 20వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. లోకేష్ పాదయాత్ర సందర్భంగా కూడా ఈ విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చినట్లు వెల్లడించారు. ప్రస్తుతం పరిశ్రమలకు విద్యుత్ చార్జీలు యూనిట్‌కు రూ.8 నుంచి 9వరకు ఉన్నాయని వాటిని రూ.2లకు తగ్గించాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, పరిశ్రమలశాఖ మంత్రి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

చిత్తశుద్ధితో అర్జీల పరిష్కారం: కలెక్టర్


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మార్చి10(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి 218 అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వలన జరిగే అనర్థాలను ఈనెల 15న జరిగే కార్యక్రమంలో ప్రజలకు తెలియ జేయాలన్నారు. అన్నిశాఖల హెచ్‌ఓడీలు, గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలు, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్ఓ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, డీసీహెచ్ఓ తిప్పేంద్రనాయక్, డీఎంహెచ్ఓ ఫిరోజ్‌బేగం, ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, ల్యాండ్ సర్వే ఏడీ విజయశాంతి, మత్స్యశాఖ చంద్రశేఖర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ శివరంగప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మల్లికార్జునయ్య పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా..

ఫీజు వసూళ్లలో మార్కెట్ కమిటీల ముందడుగు

● రూ.12.06కోట్లకు.. రూ.9.97 కోట్లు వసూలు

● టార్గెట్ పూర్తి చేసిన రాయదుర్గం కమిటీ

అనంతపురంరూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మార్కెట్ కమిటీలు ఫీజు వసూళ్లలో లక్ష్యం వైపు సాగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుతుండటంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు టార్గెట్ల సాధనకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని రెండు మార్కెట్ కమిటీలు మినహా మిగిలిన అన్ని కమిటీలు లక్ష్యం వైపులు అడుగులు వేస్తున్నాయి. ఇందులో ఇప్పటికే రాయదుర్గం మార్కెట్ కమిటీ లక్ష్యాన్ని పూర్తి చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా మార్కెటింగ్ శాఖకు 12.06కోట్ల మార్కెట్ ఫీజు లక్ష్యాన్ని సంబంధి త శాఖ ఉన్నతాధికారులు నిర్దేశించారు. ఫిబ్రవరి ఆఖరికి


అనంతపురం మార్కెట్ యార్డు


మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయం

రూ.9.97కోట్ల లక్ష్యాన్ని చేరుకుంది. ఈనెల ఆఖరుకు ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో అధికారులు నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

రెండు మినహా...

జిల్లాలో తొమ్మిది మార్కెట్ కమిటీలున్నాయి. ఇందులో రాప్తాడు, ఉరవకొండ మార్కెట్ కమిటీలు మినహా మిగిలినవి లక్ష్య సాధనలో ముందున్నాయి. రాయదుర్గం మార్కెట్ కమిటీ ఫిబ్రవరి ఆఖరుకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసింది. ఈ కమిటీకి రూ.1.44కోట్లు టార్గెట్ కాగా..1.46కోట్లు వసూలు చేసింది. ఆ తరువాత స్థానంలో శింగనమల, తాడిపత్రి కమిటీలున్నాయి. వీటి తరువాత అనంతపురం, గుత్తి , గుంతకల్లు, కళ్యాణదుర్గం కమిటీలున్నాయి. చివరి రెండు స్థానాల్లో ఉరవకొండ, రాప్తాడు కమిటీలున్నాయి. రాప్తాడు మార్కెట్ కమిటీ గత ఏడాది లక్ష్యం పూర్తి చేయడంలో పోటీ పడ్డా ఈఏడాది మాత్రం చతికిలపడింది. ఆ కమిటీకీ రూ.53లక్షలు టార్గెట్ కాగా రూ.20.73లక్షలు మాత్రమే వసూలు చేశారు. గత ఏడాది ఫిబ్రవరి నాటికి రూ.41లక్షలు వసూలు చేసినట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఉరవకొండ పరిస్థితి ఇలానే ఉంది. రూ.90లక్షలకు గాను..51.27లక్షల వసూలు మాత్రమే రాబట్టారు. గత ఆర్థిక సంవత్సరం(2023-24), ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ కమిటీ లక్ష్యం రూ.10లక్షలకుపైగా వెనుకబడి ఉండటం గమనార్హం.

మార్కెట్ కమిటీల వారిగా లక్ష్యాల వివరాలు ఇలా..

మార్కెట్ కమిటీ	లక్ష్యం రూపాయల్లో..	ఫిబ్రవరి ఆఖరుకు వసూలైంది (రూపాయల్లో..)
అనంతపురం	4.60కోట్లు	3.86కోట్లు
గుత్తి	29లక్షలు	23.92లక్షలు
గుంతకల్లు	65లక్షలు	50.47లక్షలు
కళ్యాణదుర్గం	61లక్షలు	43.24లక్షలు
రాప్తాడు	53లక్షలు	20.73లక్షలు
రాయదుర్గం	1.44కోటు	1.46కోట్లు
శింగనమల	1.02కోట్లు	92.86లక్షలు
తాడిపత్రి	2.02కోట్లు	1.81కోట్లు
ఉరవకొండ	90లక్షలు	51.27లక్షలు
మొత్తం	12.06కోట్లు	9.97కోట్లు

85 శాతం పూర్తి చేశాం

నిర్దేశిత లక్ష్యంలో 85శాతం లక్ష్యాన్ని పూర్తి చేశాం. మిగిలిన టార్గెట్లు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈనెల ఆఖరి వరకు సమయం ఉంది. రాప్తాడు రైస్ మిల్లు బంద్ కావడంతో టార్గెట్ పరంగా వెనుకబడింది. ఇక ఉరవకొండ కమిటీ పరిధిలోను ఎండుమిర్చికి ధరలేకపోవడం కొంత వరకు కమిటీ లక్ష్యంపై పడింది. ఈనెల చివరిలోగా నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేస్తాం.

- సత్యనారాయణ చౌదరి, ఏడీ, మార్కెటింగ్ శాఖ

ఉపాధి మెరుగుపరచడమే ధ్యేయం

● దివ్యాంగులకు త్వరలోనే వడ్డీ రహిత రుణాలు

● ఐడియా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పంకజ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి10(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల జీవనోపాధులు మెరుగుపరచడమే ఐడియా(ఇన్‌క్లూజివ్ దివ్యాంగ్జమ్ ఎంటర్‌ప్రెన్యూర్), సక్ష్యం స్వచ్ఛంద సంస్థల ధ్యేయమని ఐడియా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పంకజ్ అన్నారు. ఢిల్లీ నుంచి అనంతకు వచ్చిన సంస్థ ప్రతినిధులు వారం రోజులుగా దివ్యాంగుల వివరాలను సేకరిస్తున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం ఆ సంస్థ కార్యాల యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంకజ్ మాట్లాడుతూ.. ఐడియా సంస్థ చైర్మన్ ఐతా మల్లికార్జున అనంత జిల్లాలో విద్యనభ్యసించి ప్రొఫెసర్‌గా సేవలందించారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఢిల్లీలో ఐడియా స్వచ్ఛంద సంస్థను స్థాపించి దివ్యాంగులకు సహాయసహకారాలు అందిస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలో ఉన్న దివ్యాంగులకు జీవనోపాధి కలిగించాలనే ఉద్దేశ్యంతో వడ్డీ రహిత రుణాలు (రీఫండబుల్ సీడ్ మనీ) అందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. సర్వేలో భాగంగా ఉమ్మడి అనంత జిల్లా నుంచి దాదాపు 39 మంది దివ్యాంగులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకూ కొవ్వూరునగర్‌లోని విద్యారణ్య స్కూల్‌లో శిక్షణ ఇస్తామన్నారు. 15వ తేదీ శిక్షణ పొందిన వారికి ఈడీపీ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అనంతరం 15 రోజుల్లోపు ఎంపికైన దివ్యాంగులందరికి ఒక్కొక్కరికి రూ.22500 రుణాన్ని వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సక్ష్యం స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు సుంకు వేణుగోపాల్, ఐడియా ఈడీపీ ట్రైనర్ వీరం మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐడియా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పంకజ్

వర్షపు నీటిని ఒడిసి పట్టుకోండి

● కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్

అనంతపురం టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పెంపు కోసం వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సూచించారు. కరువు ప్రాంతాలలో భూగర్భ జలాల పరిస్థితులపై కలెక్టర్లతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షపు నీటిని నిల్వ చేయడంద్వారానే భూగర్భ జలాలు పెరగడానికి అవకాశం ఉంటుందని, కలెక్టర్లు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. జిల్లాలో భూగర్భ జలాలపెంపునకు తీసుకుంటున్న చర్యల గురించి కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ కేంద్రమంత్రికి వివరించారు.

22న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

అనంతపురం విద్య, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలను ఈ నెల 22న నిర్వహిస్తామని జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఆర్థిక, ప్రణాళిక, వర్కులు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. అదనపు సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. స్టాండింగ్ కమిటీల అధ్యక్షులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఫేజ్-2 కెనాల్‌కు ఔట్‌ఫ్లో నిలుపుదల

బెళుగుప్ప, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయరు నుంచి హంద్రీనీవా ఫేజ్-2 కెనాల్‌కు ఔట్‌ఫ్లో నిలిపివేసినట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 294 క్యూసెక్కులు వస్తుండగా, ప్రస్తుతం 1.521 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

చీనీ టన్ను రూ.21వేలు

అనంతపురం రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.21,500 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4,350లు, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు.

సాగు నీటి కోసం రైతుల ఆందోళన

రాయచూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నారాయణపూర్ కుడి కాలువ రాంపూర్ ఎత్తిపోతల పథకం ద్వార ఏప్రిల్ 20వ తేదీ వరకు సాగునీరు విడుదల చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి గతంలో తాము ఎన్ని సార్లు విన్నవించినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సోమవారం రైతులు ఆందోళన బాటపడ్డారు. బసవ సాగర్ నుంచి జిల్లాలోని లింగసుగూరు వరకు వంద ట్రాక్టర్‌లతో నిరసన ర్యాలీ నిర్వహించిన రైతు సంఘం నాయకులు జిల్లా యంత్రాంగం సకాలంలో నిర్ణయం తీసుకోకపోతే ఆందోళనను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రైతు సంఘం జిల్లాధ్యక్షుడు శివపుత్ర గౌడ నందిహాళ్, ఏప్రిల్ 20వ తేదీ వరకు సాగునీరు విడుదల చేయడం వల్ల రైతులు పంట నష్టానికి గురికాకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. నీటి సలహా సమితి సమావేశానికి పూర్వమే తాము ఈ రకమైన విన్నపం లిఖితపూర్వకంగా అందజేసినా అధికారుల నుంచి స్పందన లేకపోవడం బాధ్యత రాహిత్యమన్నారు. వేసిన పంటలు చేతికొచ్చే సమయంలో నీటిని నిలుపుదల చేయడం వల్ల పంటలు ఎండి రైతులు ఆర్థికంగా తీవ్ర నష్టాలపాలైయేయ ప్రబాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.


వంద ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

పెట్రోల్ బంకు పేరుతో టోకరా..!

● రూ.61.50 లక్షలు కాజేసిన వైనం

● ఉద్యోగాలిప్పిస్తానని మరో రూ.20లక్షలు

● లోకేశ్, ఎమ్మెల్యేల పేరుతో బెదిరింపులు

● ఎస్పీకి దళితుల ఫిర్యాదు

అనంతపురం క్రైం,మార్చి 10(ఆంధ్రజ్యోతి): మీ భూమిలో పెట్రోలు బంకు పెడితే అద్భుతమైన లాభాలొస్తాయని నమ్మించి రూ.61.50లక్షలు టోకరా కొట్టాడు. పిల్లలకు ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి మరో రూ.20లక్షలు తీసేసుకున్నాడు. పెట్రోల్ పంపూ లేదు... పిల్లకు ఉద్యోగాలూ లేవు. నాలుగేళ్ల నుంచి ఇలా కథలు చెప్పుకుంటూ వస్తుంటే...నిలదీశారు. కానీ అతడు డబ్బు ఇవ్వలేదు. తనకు టీడీపీ నేతలు తెలుసని, ఏం చేసుకుంటారో చేసుకోండంటూ బెదిరిస్తున్నాడు. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన పెద్దసద్దానప్ప, చిన్న సద్దానప్ప, వన్నూరమ్మ ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరితో కలిసి సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితులు విలేకరులతో తమ గోడు వెళ్లబోసుకున్నారు. దళితులైన తమకు ఆశ చూపి, ఐదెకరాల భూమిలో పెట్రోల్ పంపు ఏర్పాటు చేయిస్తామని చెప్పి అనంతపురానికి చెందిన పడమల నాగేంద్ర అనే వ్యక్తి నమ్మించి రూ.61.50 లక్షలు తీసుకున్నాడని ఆరోపించారు. ఫేక్ ఫర్మ్‌తో...పెట్రోల్ ట్యాంకులు, పెట్రోల్ పంప్ చేసే యంత్రాలను చూపించి డబ్బు విడతల వారిగా వసూలు చేశాడని వాపోయారు. తమ పిల్లలకు ఉద్యోగాలిప్పిస్తామని ముగ్గురి నుంచి మరో రూ.21లక్షలు తీసుకున్నాడని వివరించారు. 2021లో ఈ డబ్బు తీసుకున్నాడని తెలిపారు. డబ్బు ఇవ్వమని అడిగితే... చంపడానికి ప్రయత్నించామని తమపైనే నాగేంద్ర అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించారని వాపోయారు. మానవ హక్కుల సంఘం పేరుతో భయపెడుతున్నాడని తెలిపారు. తనకు మంత్రి నారా లోకేశ్, టీడీపీ ఎమ్మెల్యేలు తెలుసని భయపెడుతున్నాడని ఆరోపించారు. నాగేంద్ర కొడుకు కూడా నేతల పేర్లు చెప్పి భయపెడుతున్నాడని తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా దిక్కులేదా..?

● బాధితురాలి ఆవేదన

నార్పల మండల కేంద్రంలోని ఉద్దిబావి చేను వీధికి చెందిన తమ ఇంట్లో గత ఏడాది ఆగస్టు 25న దొంగతనం జరిగిందని... ఎస్పీ కార్యాలయంలో నాలుగుసార్లు, నార్పల పోలీస్‌స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధిత మహిళ సునీత ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎస్పీ జగదీష్‌ను కలిసి ఆమె ఫిర్యాదు చేశారు. తమ ఇంట్లో ఏడు తులాల బంగారం, 15 తులాల వెండి చోరీ జరిగిందని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని తెలిపారు. నార్పల పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారని, దొంగలను వెతికే పనిలో ఉన్నామని చెప్పారని.. అర అంగులం కూడా ముందుకెళ్లలేదని వాపోయారు. దొంగతనం అనంతరం పోలీసులు డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించారని, అది అయ్యప్ప సప్లయర్స్ షాపు వరకు వెళ్లిందని, అక్కడ ఏం విచారణ జరిగిందో తెలియదన్నారు. పోలీస్ సిబ్బంది ఫింగర్ ప్రింట్స్ తీసుకున్నారని, కానీ ఏం విచారించారో తెలియదన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న దళితులు

ఆకట్టుకున్న గురవయ్యల నృత్యం


పాలు తాగే కార్యక్రమంలో గురవయ్యలు

ఉరవకొండ,మార్చి10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠంలో వెలిసిన చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం ఆలుమత కురుబ కులస్థుల ఆధ్వర్యంలో గురవయ్యలకు పాలు తాపే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి ప్రారంభించారు. గురవయ్యలు సంప్రదాయ వేషధారణతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం శివుడికి పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక పాత్రల్లో పోసిన పాలను గురవయ్యలు తాగగా, వారి పాదాలకు నమస్కరించి భక్తులు ఆశీర్వచనాలు పొందారు. కార్యక్రమంలో గవిమఠం సహాయ కమిషనర్ రాణి, కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కే.రాజేష్, కురుబ సంఘం నాయకులు చేజాల నాగరాజు, లాలెప్ప, గూలెప్ప తదితరులు పాల్గొన్నారు.

అనంత నుంచి పాకిస్తాన్ సరిహద్దు దాకా..

● జై జవాన్, జై కిసాన్ నినాదంతో అనంత యువకుడి పాదయాత్ర


పాదయాత్ర చేసిన ప్రదీప్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జై జవాన్... జై కిసాన్ నినాదంతో అనంతపురం నగరానికి చెందిన యువకుడు ప్రదీప్‌కుమార్ అనంత నుంచి పాకిస్తాన్ సరిహద్దు దాకా పాదయాత్ర చేశాడు. ఈ ఏడాది జనవరిలో పాదయాత్ర ఆరంభించి, రాష్ట్రంలోని పలు జిల్లాలమీదుగా పాకిస్తాన్ సరిహద్దు వరకు 2300 కిలో మీటర్లు పాదయాత్ర చేశాడు. ఈనెల ఐదో తేదీతో పాదయాత్రను పూర్తి చేసుకొని, తిరిగి అనంతకు చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక ఎంజీ కాలనీలో ఈడిగ సంఘం నాయకులు, ఈడిగ కులస్థులు వేణుగోపాల్ గౌడ్, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, గంగాధర్, రవి, గోపాల్ తదితరులు ప్రదీఎకుమార్‌కు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, శివకుమార్, జగదీష్, అరుణ్, పవన్‌కుమార్, తరుణ్, కుమార్, నాగేంద్ర, ప్రకాష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ధర్మవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 12న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో 5 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారున్నారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసి, 18 నుంచి 33 సంవత్సరాలలోపు వయసున్న వారు అర్హులన్నారు. ఈ జాబ్‌మేళాకు ఎంపికైన వారికి జీతం నెలకు రూ.13వేలు నుంచి రూ.20 వేలు ఇస్తారని పేర్కొన్నారు. హైదరాబాద్, పెనుకొండ, పాలసముద్రంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకుని ఉదయం9 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9182288465 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

ఈ-పంటలో ఉందా..?

● మీ పంట వివరాలు చూసుకోండి

● రైతుసేవా కేంద్రాల్లో వివరాలు

అనంతపురం అర్బన్/ధర్మవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినప్పుడు రైతులకు పంటల బీమా, పంట నష్ట పరిహారం సక్రమంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రబీ ఈ-పంట నమోదు వివరాలను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తోంది. తద్వారా జాబితాలో పేరు లేకపోయినా, తప్పులు ఉన్నా సరిచేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. ఈ నెల 15వ తేదీ వరకూ జాబితా ప్రదర్శన ఉంటుంది. 20వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరిస్తారు. తహసీల్దారు, వ్యవసాయ శాఖ అధికారి ఆమోదించిన తుది జాబితాను ఈ నెల 22న రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారు.

ఆర్ఎస్కేల్లో వివరాలు

సామాజిక తనిఖీ కోసం రైతు సేవా కేంద్రాల్లో రబీ ఈ-పంట నమోదు వివరాలను ప్రదర్శనకు ఉంచామని అనంతపురం జేడీఏ ఉమామహేశ్వరమ్మ, శ్రీసత్యసాయి జిల్లా జేడీఏ సుబ్బారావు సోమవారం తెలిపారు. ఈ నెల 15వతేదీ దాకా వివరాలను ప్రదర్శిస్తామని తెలిపారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి, ఈ-పంటలో వివరాలు చదివి వినిపిస్తామని తెలిపారు. అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతపురం జిల్లాలో 2024-25 రబీ సీజన్‌లో 83,451 హెక్టార్ల విస్తీర్ణాన్ని ఈ-పంట నమోదు చేశామని ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మొత్తం 54,554 మంది రైతులకుగాను 51,716 మంది రైతుల ఈకేవైసీ (95 శాతం) పూర్తి అయిందన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కృష్ణన్ నాయర్ (జయంతి)



కథాకళి నృత్యానికి వన్నె తెచ్చిన 'పద్మశ్రీ' గ్రహీత కళామండలం కృష్ణన్ నాయర్ 1914 మార్చి 11న కేరళ రాష్ట్రం కన్నూర్ ప్రాంతంలో జన్మించారు. ప్రత్యేకించి రస-అభినయలో పేరొందారు. నలన్, భీమన్, అర్జునన్, రుక్మాంగదన్, కర్ణన్ పాత్రల్లో పేరొందారు. మోహినీయాట్టం కళాకారిణి కళ్యాణి కుట్టిని వివాహం చేసుకున్నారు. సంగీత నాటక అకాడమీ తదితర పురస్కారాలు పొందారు. 1990 ఆగస్టు 15న కన్నుమూశారు.

విజయ్ హజారే (జయంతి)



ప్రముఖ క్రికెటర్ 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత విజయ్ శామ్యుయేల్ హజారే 1915 మార్చి 11న మహారాష్ట్ర రాష్ట్రంలోని సాంగ్లిలో జన్మించారు. క్రికెట్‌లో 1951-53 మధ్య భారతజట్టుకు కేప్టెన్‌గా వ్యవహరించారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో రెండుసార్లు త్రిపుల్ సెంచరీ చేసిన తొలి ఇండియన్ బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందారు. 60 ఫస్ట్‌క్లాస్ సెంచరీలు చేశారు. రిటైర్మెంట్ తర్వాత టెస్ట్ క్రికెట్ సెలెక్టర్‌గా వ్యవహరించారు. ఆయన గౌరవార్థం దేశంలో జోనల్ టోర్నీలో 'విజయ్ హజారే ట్రోఫీ' ప్రవేశపెట్టారు. 2004 డిసెంబరు 8న కన్నుమూశారు.

మాధవపెద్ది సత్యం (జయంతి)



నేపథ్య గాయకుడు, తెలుగు నాటక కళాకారుడు మాధవపెద్ది సత్యం 1922 మార్చి 11న గుంటూరు జిల్లా బాపట్లలో జన్మించారు. 1946లో 'రామదాసు' తమిళ, హిందీ ద్విభాషా చిత్రంతో నటుడిగా, గాయకుడిగా ఆరంగేట్రం చేశారు. ప్రత్యేకించి ఎస్వీ రంగారావు, రేలంగి, రమణారెడ్డిల గొంతుకు అనుగుణంగా పాటలు పాడారు. 'మాయాబజార్'లోని 'వివాహ భోజనంబు', 'కులగోత్రాలు'లోని 'అయ్యయ్యో జేబులో డబ్బులు పోయెనె' వంటి పాటలు ఎంతో పేరొందాయి. తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ, హిందీ, సింహళ భాషలతో సహా దాదాపు అన్ని భారతీయ భాషలలో 7వేలకుపైగా పాటలు పాడారు. 2000 డిసెంబరు 18న కన్నుమూశారు.

డాక్టర్ వీ శాంతా (జయంతి)



ప్రముఖ డాక్టర్ వీ శాంతా 1927 మార్చి 11న మద్రాస్‌లో జన్మించారు. ఆంకాలజిస్ట్‌గా, అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ చైర్ పర్సన్‌గా వ్యవహరించారు. ప్రతి వ్యక్తికి వైద్యసేవలు అందుబాటులో ఉండాలన్న ఆదర్శం, సాటి వ్యక్తికి మేలు చేయాలన్న లక్ష్యంతో సాగారు. జాతీయ, అంతర్జాతీయ ఆరోగ్య కమిటీలలో సభ్యురాలిగా వ్యవహరించారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, రామన్ మెగసెసె అవార్డులు లభించాయి. 2021 జనవరి 19న కన్నుమూశారు.

అగర్వాల్ కంటి ఆసుపత్రులచే ఉచిత గ్లకోమా పరీక్షలు

బెంగళూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అగర్వాల్ కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో ప్రపంచ గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకుని మార్చి నెలాఖరు దాకా ఉచిత పరీక్షలు జరుపుతున్నట్టు ప్రకటించారు. గ్లకోమా కంటిపొరకు సంబంధించిన సమస్య అని ఆసుపత్రి రీజనల్ ముఖ్యులు డాక్టర్ రవి దొరైరాజ్ తెలిపారు. సమయానికి పరీక్షలు జరిపించుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. గ్లకోమా చికిత్సలు ఇటీవల సులభతరం అయ్యిందన్నారు. అగర్వాల్ ఆసుపత్రిలో ముందుగా పేర్లు నమోదు చేసుకుని ఉచితంగా పరీక్షలు పొందవచ్చునన్నారు.

వ్యాపారమే కాదు... సమాజసేవా చేయాలి

» సిద్ధలింగ స్వామీజీ

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జీవనం, లాభం కోసం వ్యాపారాలు చేయడం సహజమని అయితే సమాజసేవ కూడా చేయాలని తుమకూరు సిద్ధగంగ మఠాధిపతి సిద్ధలింగస్వామిజ అభిప్రాయపడ్డారు. విజయనగర్ ప్రాంతం హంపినగర్‌లో బెనక బి స్పోక్ కస్టమ్ మేడ్ దుకాణాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యేలు ఎం కృష్ణప్ప, ప్రియాకృష్ణ, సినిమా నిర్మాత టీకే శ్రీనివాస్, సుశ్మితా జగ్గప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్ధలింగస్వామిజీ మాట్లాడుతూ ప్రతి మనిషి నిత్యావసరాలు కొనుగోలు చేయక తప్పదని, కానీ లాభాలకోసమే వ్యాపారాలు అనేలా ఉండరాదన్నారు. స్టోర్స్ నిర్వాహకులు బెనక రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరో తరగతికి ప్రత్యేక కోచింగ్

అగళి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 25నుంచి మొదలైన విషయం తెలిసిందే. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న పిల్లలకు 11నుంచి 25వరకు ప్రత్యేకంగా కోచింగ్ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. ప్రతి రోజు 4 నుంచి 6 గంటల వరకు క్లాసులు ఉంటాయన్నారు.

బియ్యం కార్డుదారులకు మరో అవకాశం

మడకశిరటౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వ్యాప్తంగా బియ్యం అందని లబ్ధిదారులకు మరోసారి కలెక్టర్ ఆదేశాలతో బియ్యం అందించనున్నారు. 90 శాతం పూర్తి చేసిన డీలర్లకు మరోసారి బియ్యం సరఫరా చేసి రెండు రోజుల్లో ఎఫ్‌పీషాపు నుంచి కార్డు లబ్ధిదారులకు అందించనున్నారు.

పరిపాలన అధికారిగా రాజేంద్రప్రసాద్

అగళి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా రాజేంద్రప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీఓ యాదవేంద్ర తెలిపారు. ఇక్కడ పరిపాలన అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాసరావు మడకశిరకు బదిలీకాగా మడకశిర పంచాయతీరాజ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్ ఏఓగా ఇక్కడికి వచ్చారు.

పరిషత్‌లో పీఈఎస్ చాన్స్‌లర్ దొరస్వామికి ఘన నివాళులు

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ యూనివర్శిటీ చాన్స్‌లర్, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామికి విధానపరిషత్‌లో ఘన నివాళులు అర్పించారు. సోమవారం పరిషత్ కలాపాలు ప్రారంభం కాగానే సభాపతి బసవరాజహొరట్టి సంతాప సందేశాన్ని ప్రవేశపెట్టారు. విధాన పరిషత్ సభ్యుడిగా, విద్యాసంస్థల వ్యవస్థాపకులుగా ఎంఆర్ దొరస్వామి అపారమైన సేవలు అందించారని, ఆయన ఇటీవల మృతి చెందారన్నారు. చిత్తూరు జిల్లా నగ్రావూరులో వ్యవసాయ కుటుంబంలో జన్మించి చదువు కోసం బెంగళూరుకు వచ్చి న్యాయవాద కోర్సు చేశారన్నారు. కొంతకాలం ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఆ తర్వాత సొంతంగా పీఈఎస్ విద్యాసంస్థను ప్రారంభించారన్నారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పేరొందేలా గుణాత్మక విద్య అందించారన్నారు. ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల ద్వారా అన్ని వర్గాలకు సేవలు అందించారన్నారు. 2008 నుంచి 2014 వరకు ఎమ్మెల్సీగా కొనసాగారన్నారు. వివిధ పురస్కారాలు పొందారన్నారు. 2020 నుంచి రాష్ట్రప్రభుత్వ విద్యాసంస్కరణల సలహాదారులుగా వ్యవహరించారన్నారు. ఆయన ప్రభుత్వ విద్యాసంస్థలలో మౌలిక సదుపాయాల పెంపుకోసం కృషి చేశారన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు స్వగ్రామాలలో పాఠశాలల అభివృద్ధి చేసుకోవాలనే పిలుపుతో వందలాది పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. పలు ప్రైవేట్ యూనివర్సిటీలు దత్తత తీసుకునేందుకు ఆయనే ప్రేరణ అన్నారు. అనంతరం సభానాయకుడు బోసరాజు, ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి సహా పలువురు సభ్యులు దొరస్వామితో అనుభవాలను పంచుకున్నారు. అనంతరం దొరస్వామి ఆత్మకు శాంతి చేకూరాలని సభ్యులంతా మౌనం పాటించారు. సంతాప సూచన నిర్ణయాన్ని వారి కుటుంబ సభ్యులకు పంపనున్నట్టు సభాపతి ప్రకటించారు.



పరిషత్‌లో సంతాపం వ్యక్తం చేస్తున్న సభ్యులు

పోటాపోటీగా శాసనసభాపక్ష భేటీలు



బీజేఎల్పీ సమావేశంలో అశోక్, ఛలవాది నారాయణస్వామి తదితరులు



సీఎల్పీ సమావేశంలో సీఎం, డీసీఎం తదితరులు

బెంగళూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీజేపీల శాసనసభాపక్ష భేటీ సోమవారం రాత్రి వేర్వేరుగా జరిగాయి. సీఎల్పీ సమాశంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ప్రతిపక్షాల అస్త్రాలను ఎలా తిప్పికొట్టాలనే అంశంపై చర్చించినట్టు తెలుస్తోంది. ఇక బీజేఎల్పీ సమావేశంలో ప్రతిపక్షనేతలు అశోక్, ఛలవాది నారాయణస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు. సమావేశాలలో అధికార పార్టీని ఎలా ఇరుకున పెట్టాలనే అంశాలపైనే చర్చ జరిగినట్టు తెలుస్తోంది.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

బంగారపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం సమీపిస్తున్నందున బంగారపేట పట్టణ పరిధిలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఇళ్లల్లో నీరు వృథా చేయరాదని పురసభ ముఖ్య అధికారి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పురసభ కార్యాలయంలో వాటర్‌మ్యాన్‌లతో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండలు ప్రారంభమయ్యాయని, పట్టణంలోని ఏ వార్డులోనూ నీటి సమస్య తలెత్తకుండా ఉన్న నీరు సద్వినియోగం అయ్యేలా చూడాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. జిల్లా అధికారి ఆదేశాల మేరకు పట్టణానికి యరగోల్ డ్యాం నుంచి రోజుకు 20 గంటలపాటు నీరు వస్తుందన్నారు. అందుకు అనుగుణంగా వాటర్‌మ్యాన్‌లు తమ వార్డులలోని పంప్ హౌస్‌లనుంచి నీటిని విడుదల చేయాలని సూచించారు. రెండు షిఫ్ట్‌లుగా నీటిని సరఫరా చేయాలన్నారు. వర్షం ప్రమాణం తక్కువగా ఉండడంతో నీటి సమస్య ఉందన్నారు. జలవనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సమావేశంలో ఇంజనీర్ రవి, సిబ్బంది మంజునాథ్, వాటర్‌మ్యాన్‌ల మేస్త్రీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పురసభ ముఖ్యఅధికారి సత్యనారాయణ

బైక్ రైడింగ్‌పై శిక్షణ



శిక్షణ పొందిన మహిళలు

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్కూటర్, మోటార్ సైకిల్ రైడింగ్ గురించి వృత్తిపర శిక్షణ శిబిరం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయల్ బ్రదర్స్, ఎంబీఎస్ఐ సంస్థలు సంయుక్తంగా ఆర్‌బి ఫర్ ఉమెన్ పేరిట పదో ఎడిసన్ ప్రారంభించారు. నగరంలోని రెడ్ రైడర్స్ గో కార్టింగ్ గ్రౌండ్స్‌లో వందమంది మహిళలు తర్ఫీదు పొందారు. కొత్త వాహనాలు నడపడం, మరిన్ని అవకాశాలకు వీలు లభించినట్టు కానుందని పలువురు అభిప్రాయపడ్డారు. మహిళా స్వావలంబనకోసం శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. శిబిరంలో ఆర్‌బీ సహసంస్థాపకులు, సీఈఓ అభిషేక్ చంద్రశేఖర్, ఎంబీ ఎస్ఐ సీఈఓ, ఎండీ నకావూ హిరషి తదితరులు పాల్గొన్నారు.

కోలారు జిల్లాకు సంక్షేమాలేవీ..?

ముళబాగిలు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సమర్పించిన బడ్జెట్‌లో కోలారు జిల్లాకు ఎటువంటి ప్రజాసంక్షేమ పథకాలు ప్రకటించలేదని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తాలూకాలోని కాశిపుర గ్రామంలో రూ.16లక్షలతో నిర్మించిన బాలస్నేహి అంగన్‌వాడి నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. మైసూరు, దక్షిణకన్నడ జిల్లాలకు అత్యధిక గ్రాంట్లు కేటాయించిన ముఖ్యమంత్రి తన సొంత జిల్లా మైసూరుకు ఎక్కువ గ్రాంటు కేటాయించారని విమర్శించారు. తాను జేడీఎస్ ఎమ్మెల్యే కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత గ్రాంటు మంజూరు చేస్తే ఆమేరకు తాలూకా అభివృద్ధికి శ్రమిస్తానన్నారు. శాసనసభ సమావేశాలలో నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించి ఎక్కువ నిధులు మంజూరయ్యేలా ప్రయత్నిస్తానన్నారు. ఇప్పటికే తాలూకాలో 125 కిలోమీటర్ల రోడ్డు పనులకు టెండరు పిలిచారన్నారు. గ్రామాలలో మట్టి రోడ్డు లేకుండా కనీస మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ శోభా, గ్రామపంచాయతీ సభ్యుడు కాశిపుర మునియప్ప, జేడీఎస్ తాలూకా కార్యదర్శి నల్లూరు రఘుపతిరెడ్డి, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్

పొలాలకు వెళ్లకుండా రోడ్డు తవ్వేశారు

దొమ్మసంద్ర, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి చంబేనహళ్ళి గ్రామపంచాయతీ చుట్టుపక్కల భూ మాఫియా ధాటికి వందేళ్లకుపైగా ఉన్న రోడ్డు సైతం కబ్జా చేసి పొలాలకు వెళ్లేందుకు వీలు లేకుండా రైతులకు షాక్ ఇచ్చిన ఘటన చోటు చేసుకుంది. రోజురోజుకు భూముల విలువ ఆకాశాన్ని తాకుతుండడంతో ఇదే అదునుగా కొంతమంది రియల్టర్లు దందాకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సొంత పొలాలకు వెళ్లేందుకు దారి ఇవ్వకుండా రోడ్డుపై పొక్లైనర్‌తో చంబేనహళ్ళిలో గుంత తవ్వేశారు. పోలీస్ స్టేషన్‌లోనూ, రెవెన్యూశాఖలోనూ న్యాయం లభించడం లేదని, తమ గోడు ఎవరికి వెళ్లబోసుకోవాలని స్థానికులు, రైతులు వాపోతున్నారు.



చంబేనహళ్ళిలో రోడ్డు తవ్వేసిన దృశ్యం

ఇండిగో హబ్‌గా బెంగళూరు ఎయిర్‌పోర్ట్



ఇండిగో విమానం

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యధికమంది ప్రయాణికులకు అనుకూలంగా ఉన్న విమానాశ్రయాలలో దేవనహళ్ళి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కూడా ఒకటి. ప్రస్తుతం రోజూ 650కుపైగా విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వివిధ విమాన యాన కంపెనీలు బెంగళూరు నుంచి దేశ విదేశాలకు సర్వీసులు నడిపేందుకు ఆసక్తి చూపుతున్నాయి. అందులో ఇండిగో విమానయాన సంస్థ కూడా ఉంది. దేశంలో బెంగళూరు ఎయిర్‌పోర్ట్ ఇండిగో సంస్థకు రెండో హబ్‌గా మారుతోంది. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ నుంచి 67 దేశీయ, 13 అంతర్జాతీయ విమాన సర్వీసులను ఇండిగో సంస్థ కొనసాగిస్తోంది. ఏకంగా ఇండిగోసంస్థ బెంగళూరు ఎయిర్‌పోర్ట్ నుంచి 80 విమాన సర్వీసులు కలిగి ఉన్నట్టయ్యింది. ఇండిగో వర్జిన్ అట్లాంటిక్, బ్రిటీష్ ఎయిర్‌వేస్, మలేషియా ఎయిర్‌వేస్, ఎయిర్ ఫ్రాన్స్, ఖతార్ ఎయిర్‌వేస్, జపాన్ ఎయిర్‌వేస్, కేఎల్ఎం, క్వాంటాస్‌లతో పాటు పలు అంతర్జాతీయ విమాన సర్వీసులతో కోడ్ షేర్ సహభాగత్వం కలిగి ఉంది. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ మూడో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయంగా నిలిచింది. ఇండిగో విమానాల కార్యాచరణలో 53శాతం భాగస్వామ్యం కలిగి ఉంది. గతంలో 60శాతం భాగస్వామ్యం ఉండేది. బెంగళూరు నగరంలో ఆకాశ్ ఎయిర్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లు ప్రముఖ కేంద్రంగా సర్వీసులు నడుపుతున్నాయి.

దరఖాస్తు చేసుకోండి

గోరంట్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బీసీ, ఈబీసీ, కాపు కులాలకు సంబంధించిన మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 50యేళ్ల లోపు వయస్సున్న మహిళలు సంబంధిత సచివాలయాల్లో కార్యదర్శి ద్వారా వెల్ఫేర్ అసిస్టెంట్‌లాగిన్‌లో శిక్షణకోసం రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. ఆసక్తిగలవారు రేషన్, ఆధార్, కులధృవీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 90రోజుల శిక్షణ ఉంటుందన్నారు. లబ్ధిదారులు వీలును బట్టి సమయం ఎంచుకోవచ్చన్నారు.

మూడు గడ్డివాములు దగ్ధం

బాగేపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మారగాన కుంటె గ్రామపంచాయతీ పరిధిలోని జోగిరెడ్డిపల్లి గ్రామంలో అకస్మికంగా మంటలు చెలరేగడంతో మూడు గడ్డివాములు దగ్ధ మయ్యాయి. ఆదివారం చోటు చేసుకున్న ఘటనలో పశుగ్రాసం కాలిపోవడంతో రైతులు విచారం వ్యక్తం చేశారు. నేసె ఆంజనేయులు, నరసింహప్పలకు చెందిన గడ్డివాములు కాలిపోయాయి. నిల్వ చేసుకున్న గడ్డివాము కాలిపోవడంతో నష్టపోయినట్టు రైతులు తెలిపారు. ప్రభుత్వం తమను అన్ని విధాలా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కాలిపోతున్న గడ్డివామి

నిరంతర శ్రమతోనే ఉన్నత శిఖరాలకు..



వేదికపై నటుడు రమేశ్ అరవింద్, ఎమ్మెల్యే విశ్వనాథ్ తదితరులు

» నటుడు రమేశ్ అరవింద్

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నిరంతరంగా కఠోర పరిశ్రమ, చదువుకోవాలనే లక్ష్యం ఉంటేనే ఉన్నత శిఖరాలకు చేరడం సాధ్యమని నటుడు రమేశ్ అరవింద్ అభిప్రాయపడ్డారు. ఆదిత్య హబ్బ 2025 ఇంటర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటైన కార్యక్రమంలో మాజీ కులపతి సచ్చిదానంద, ఎమ్మెల్యే విశ్వనాథ్, ఆదిత్య గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీపీ విశ్వనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేశ్ అరవింద్ మాట్లాడుతూ చదువుతోపాటు కళలల్లోనూ భాగస్వామ్యులు కావాలన్నారు. సృజనశీలత ద్వారా భిన్నమైన రంగాలలో భాగస్వామ్యులు కావాలన్నారు. నేర్చుకోవడం అనే తపన ఉండాలని, ఓటమి ఒక పాఠం కావాలన్నారు. 50 కళాశాలలనుంచి విద్యార్థులు ఫోటోగ్రఫీ, చిత్రకళా, సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. రాజీవ్‌గాంధీ హెల్త్ యూనివర్సిటీ సిండికేట్ మెంబర్ డాక్టర్ మధుసూధన్, కరుణాకర్ రాయ్, ప్రియావిశ్వనాథ్, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కల సాకారం చేసిన కాంగ్రెస్ నాయకుడు



వంటసామగ్రితో పుట్టు ఆంజినప్ప తదితరులు

శిడ్లఘట్ట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి కల సాకారం చేసేందుకు రూ.18లక్షలతో కల్యాణమండపాన్ని కాంగ్రెస్ నాయకుడు, సమాజ సేవకుడు పుట్టు ఆంజినప్ప ప్రారంభించారు. స్నేహితుడైన పర్యావరణ ప్రేమికుడు బెళ్ళూటి సంతోష్ గుండెపోటుతో దూరమయ్యాడని ఆంజినప్ప పేర్కొన్నారు. స్నేహితుడి కోసం బెళ్ళూటి గ్రామంలోని గుట్టాంజనేయస్వామి కల్యాణ మండపాన్ని ఎస్ఎన్ క్రియా ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు 18 లక్షలతో అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఇదే సందర్భంగా 2500మందికి వంట తయారు చేసే సామగ్రిని సమకూర్చారు. కార్యక్రమంలో ఆనూరు గ్రామపంచాయతీ సభ్యురాలు వరలక్ష్మి, సంతోష్, లతా దేవరాజ్, ప్రేమ ఆనంద్, పీఎల్‌డీ బ్యాంకు డైరెక్టర్ గుడిహళ్ళి చంద్రు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెరగాలి



వేదికపై పావన తదితరులు

విజయనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన పెరగాలని విద్యాలక్ష్మి ఇంటర్నేషనల్ పబ్లిక్‌స్కూల్ డైరెక్టర్ పావన అభిప్రాయపడ్డారు. మాగడి మెయిన్‌రోడ్డు అంజనానగర్‌లోని పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటైన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయినుంచే విద్యార్థినులు కరాటే వంటివి నేర్చుకోవాలన్నారు. తద్వారా ఆత్మరక్షణ సాధ్యమన్నారు. ఆరోగ్యంపట్ల జాగ్రత్త వహించాలన్నారు. పాఠశాల కార్యదర్శి మంగళ సిద్ధలింగయ్య, ప్రిన్సిపాల్ సిద్ధలింగయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అవగాహనతోనే గ్లకోమా సమస్యలు పరిష్కారం

» నారాయణ నేత్రాలయ సీఈఓ కెప్టెన్ మిట్టల్



పరుగుకు పచ్చజెండా

బెంగళూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గ్లకోమా సమస్యలపట్ల నిర్లక్ష్యం చేయరాదని, కంటి పరీక్షలు జరిపించుకుని సకాలంలో చికిత్సల తోనే సమస్య పరిష్కారం కానుందని నారాయణ నేత్రాలయ సీఈఓ కెప్టెన్ ఎస్కే మిత్తల్ అభిప్రాయపడ్డారు. గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రామగొండనహళ్ళి అటవీప్రాంతంలో మొక్కలు నాటారు. అంతకుముందు 5కే సైట్ సేవర్ రన్‌ను నిర్వహించారు. 300 మందికిపైగా భాగస్వామ్యులయ్యారు. ఇంటర్నేషనల్ అథ్లెటిక్ అర్జున్ దేవయ్య, ఆర్జే ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1602.94	1,584.83
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,076	2.169
నీటి నిల్వ (టీఎంసీలు)	25.56	7.21



ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్

యథేచ్ఛగా ఎర్రమట్టి అక్రమ రవాణా

సిరుగుప్ప, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎర్రమట్టి అక్రమ రవాణా మళ్లీ మొదలైంది. తాలుకాలోని ఎర్ర మట్టి, ఇసుక రవాణాను అరికట్టడంతో ఇసుక రవాణా బంద్ అయ్యింది. అయితే ఇటీవల అక్రమార్కులు మళ్లీ తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. జిల్లా ఘనుల శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తు న్నారు. తక్షణమే అక్రమ ఇసుక, ఎర్రమట్టి రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.


వైభవంగా కోడోత్సవం



ఎడ్లబండ్ల ఊరేగింపు

కంప్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : హడగలి తాలుకాలోని అంగూర్ గ్రామంలో బసవేశ్వర బండి కోడోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఏటా ఎద్దుల బండ్లను అలంకరించి బండి కోడోత్సవాలు వైభవంగా జరుపుకుంటామని గ్రామస్థులు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జోడెద్దులతో ఊరేగింపు నిర్వహించారు. రంగురంగుల పేపర్లతో బండ్లను అలంకరించారు. అనంతరం గడ్డి బసవేశ్వరకు ప్రత్యేక పూజలు నిర్వహించుకుని గ్రామంలో రాత్రి వివిధ ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సమీప గ్రామాల ప్రజలు భారీగా తరలి వచ్చారు.

సిడిబండి ఉత్సవానికి తరలిన ఎద్దులు



ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

సిరుగుప్ప, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో జరుగనున్న దుర్గమ్మదేవి సిడిబండ ఉత్సవాన్ని లాగడానికి సిరుగుప్ప పట్టణానికి చెందిన గానుగ సమాజం ఆధ్వర్యంలో ఎద్దులను సింగారించి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఏటా ఉత్సవానికి తెలంగాణ నుంచి గానుగ సమాజం వారు ఎద్దులను కొనుగోలు చేసి ఉత్సవం లాగడం ఆనవాయితీ అని సమాజ పెద్దలు తెలిపారు. గానుగ సమాజం అధ్యక్షుడు రామయ్య నేతృత్వంలో కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి పట్టణ శివారు వరకు ఎద్దులను తాళమేళాలతో, డోలు ఢమరులతో వెండి ఆభరణాలతో సింగారించి ఊరేగింపుగా తీసుకెళ్లారు. సిడిబండి ఉత్సవానికి తరలిరావాలని గ్రామస్థులను వారు కోరారు. ఈ సందర్భంగా గానుగ సమాజం ప్రముఖులు కృష్ణ, రఘు, శివ, బుల్లబ్బాయి పాల్గొన్నారు.

హంపిలో విచ్చలవిడిగా మాదకద్రవ్యాలు

● అక్రమాలకు సహకరిస్తున్న హోంస్టే నిర్వాహకులు ● నాడు విరుపాపుర అడ్డాగా.. నేడు సనాపురంలో..

బళ్లారి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాతి గాంచిన పర్యాటక ప్రాంతం హంపిలో మాదకద్రవ్యాలు మరణ శాసనాలుగా మారుతున్నాయి. స్థానికంగా ఉన్న కొందరు గంజాయి, మద్యంతో పాటు మాదకద్రవ్యాలు అమ్ముతున్నారు. హో-స్టేల నిర్వహకులతో పోలీసులు చేతులు కలుపుతున్నారని కొందరు స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. సనాపుర సరస్సులో సమీపంలో జరిగిన ఘటనతో ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి.



సనాపురం సమీపంలో మద్యం ప్యాకెట్లు

నాడు నది అవతల.. నేడు ఇవతల..

హంపి పై బాగంలో తుంగభద్ర డ్యాం ఉంది. డ్యాం నుంచి నదికి తుంగభద్ర జలాలు ప్రవహిస్తుంటాయి. నదికి పై ప్రాంతం నుంచి కుడివైపు హంపి చుట్టూ పలు పర్యాటక ప్రాంతాలున్నాయి. పర్యాటకులు తెప్పల్లో విహరిస్తుంటారు. నది అవతల వైపు విరుపాపుర గడ్డ(ఒడ్డు) అని గతంలో ఉండేది. అక్కడ అప్పట్లో ఎక్కువగా మాదకద్రావ్యాల విక్రయాలు, గంజాయి అమ్మకాలు సాగేవి. సుమారు ఏడేళ్ల క్రితం ఇక్కడ ఉన్న అన్ని రిసార్టులు- హో-స్టేలు అప్పటి కొప్పళ, బళ్లారి జిల్లాల కలెక్టర్లు తొలిగించారు. అప్పటి నుంచి స్మగ్లర్లు మకాం మార్చారు. కొందరు హో-స్టే నిర్వాహకులు మాదకద్రవ్యాలు, అసాంఘీక కార్యకలాపాలకు సహకరిస్తున్నారు. వీరికి కొందరు రాజకీయ నేతల మద్దతు ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు విదేశీ టూరిస్టులను మాదక ద్రవ్యాలతో ముంచెత్తి వారిని హింసించిన ఘటనలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. ఒంటరిగా వచ్చే టూరిస్టులను ఇక్కడ ఉండే కొందరు వ్యక్తులు పరిచయం పెంచుకుని వారిని మత్తులోకి దింపుతుంటారు. కొన్నిసార్లు వాళ్ల వద్ద నగదు, మొబైల్స్ తీసుకుని నదిలోకి తోసేసిన సందర్భాలూ ఉన్నాయి. ఒకవేళ మృతదేహాలు బయటపడినా ప్రమాద ఘటనలుగా చిత్రీకరిస్తునారన్న ఆరోపణలున్నాయి.

మాదక ద్రవ్యాలు సేవించిన నిందితులు

విదేశీ మహిళపై అత్యాచార ఘటనతో పోలీసులు ఉలిక్కిపడ్డారు. ఇప్పటికే ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఇద్దరిని అరెస్టు చేసి వైద్యపరీక్షలు చేయించగా ఆ యువకులు మాదకద్రవ్యాలు సేవించినట్లు తేలిందని కొప్పళ ఎస్పీ విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఇద్దరు మువతులపై అత్యాచారం చేశామని ముగ్గురు నిందితులు అంగీకరించినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ దుర్ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. హంపిలాంటి ప్రపంచ పర్యాటక ప్రాంతంలో ఇలాంటి దుర్ఘటన జరగడం బాధాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితురాలు విదేశీయురాలు కావడంతో భారత్‌కు చెడ్డ పేరు తెచ్చారని బీజేపీ నాయకులు మండిపడుతున్నారు. కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి ఎక్స్ సామాజిక మాధ్యం ద్వారా ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దరామయ్య కూడా జరిగిన దుర్ఘటనకు చింతించామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ప్రభుత్వం గట్టి సూచనలు చేసింది. సనాపురంలో మాదకద్రవ్యాలు, మద్యం అమ్మకాలు జరగరాదని ఆదేశించింది. సనాపురం ఘటన తో పర్యాటక ప్రదేశం కొంత స్తబ్దంగా మారింది.



మాట్లాడుతున్న కొప్పళ ఎస్పీ రామ్ అరసిద్ధి

వైభవంగా వీరభద్రేశ్వరస్వామి మహారథోత్సవం

కంప్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తాలుకా సమీపంలోని సన్నాపురం గ్రామంలో తుంగభద్ర నది ఒడ్డున ఉద్భవ వీరభద్రేశ్వరస్వామి మహా రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. మహా రథోత్సవం సందర్భంగా ఆలయంలో ఆదివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో విద్యుద్దీపాలతో అలంకరించారు. అనంతరం గ్రామంలోని మహిళలు, చిన్నారులు, పురుషులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించి రథాన్ని ఎక్కించారు. సాయంత్రం భక్తులందరి సమక్షంలో సకల వాయిద్యాలతో, పూర్వీకుల కలశ నందినితో శ్రీ ఉద్భవ వీరభద్రేశ్వరుని మహారథోత్సవాన్ని అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ రథోత్సవానికి పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు కదిలివచ్చారు. రాత్రి గ్రామ నాటక కళాకారులతో బహిరంగ నాటకం గిరిజా కళ్యాణం ప్రదర్శించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

హంపిలో భద్రత పెంచాలి

● కాంగ్రెస్ తాలూకా అధ్యక్షుడు లక్ష్మణ్



గంగావతి రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గంగావతి తుంగభద్ర నది సమీపంలోని సణపూర్‌లో గ్యాంగ్ రేప్ జరిగిన దుర్ఘటనను బాధాకరమని, అక్కడ భద్రత పెంచాల్సిన అవసరం ఉందని గంగావతి తాలూకా కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విదేశీ పర్యాటకులు సణపూర్, అంజనాద్రి పర్వతం, పంపా సరోవరం వద్ద అధికంగా సంచరిస్తుంటారని, ఇన్నేళ్లుగా ఎంతో మంది విదేశీయులు ఇక్కడికి వస్తుంటారన్నారు. పర్యాటక ప్రాంతంలో ఇలాంటి దుర్ఘటన జరగడం బాధాకరమన్నారు. రాత్రి సమయంలో ఎవరు బయటకు వెళ్లకుండా రెస్టారెంట్ల ఓనర్లు జాగ్రత్త పడాలన్నారు. అనెగొంది, హంపి నడుమ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. విదేశీ పర్యాటకులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

శిశువులకు వినికిడి పరీక్షలు తప్పనిసరి: డీహెచ్ఓ

బళ్లారి సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పుట్టిన తర్వాత ప్రతి నవజాత శిశువుకు నెలకు రెండు సార్లు తప్పనిసరిగా వినికిడి పరీక్ష చేయించుకోవాలని, ఇది వినికిడి లోపాన్ని వీలైనంత తర్వాత చికిత్స చేయడంలో సహాయపడుతుందని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు అన్నారు. జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఆసుపత్రి , చెవి ముక్కు, గొంతు శాఖల సహకారంతో సోమవారం నగరంలోని జిల్లా ఆసుపత్రిలో నిర్వహించిన ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భవిష్యత్తులో వినికిడి లోపం రాకుండా ఉండాలంటే పుట్టిన తర్వాత శిశువులకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. జిల్లా ఆసుపత్రిలో వినికిడి లోపానికి చికిత్స ఉందని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత 3సంవత్సరాల్లో జిల్లాలో 14మందికి కనీసం రూ.10లక్షల విలువైన కోక్లియర్ ఇంప్లాంట్లు అందించామని, 400మందికి హియరింగ్ ఎయిడ్లు అందించామని, 5,240 మంది నవజాత శిశువులకు వినికిడి పరీక్షలు నిర్వహించామని తెలిపారు.

వినికిడి లోపానికి కారణాలు

గర్భధారణ సమయంలో ఇన్ఫెక్షన్, అకాల శిశువు ప్రసవ సమయంలోఆక్సిజన్ లేకపోవడం, పుట్టిన తర్వాత తీవ్రమైన కామెర్ల కారణంగా నవజాత శిశువుల్లో వినికిడి సమస్య తలెత్తుతుం దన్నారు. పిల్లలు, పెద్దల్లో మెనిజైంటిస్. మీజిల్స్, గవదబిళ్లలు చెవి ఇన్ఫెక్షన్లు, కొన్నిమందుల వాడకం, తల తేదా చెవికి గాయం, ఏపరిస్థితిలోనైనా పెద్ద శబ్దాలకు గురికావడం, అసురక్షిత స్థాయిలో వ్యక్తిగత ఆడియో పరికరాల ద్వారా చెవుడు వచ్చే అవకాశం ఉందన్నారు. వృద్ధాప్యంలో ఏ పరిస్థితిలోనైనా పెద్ద శబ్దాలకు గురికావడం , అధిక రక్తపోటు, మధుమేహం,కొన్ని మందుల వాడకం వల్ల చెవుడు వస్తుందన్నారు.
జిల్లాసర్జన్ డాక్టర్ బసారెడ్డి మాట్లాడుతూ పిల్లలు, పెద్దలు తేడా లేకుండా చెవుల్లో ఎలాంటి వస్తువులు పెట్టుకోవద్దని,శబ్దం చేసే ప్రదేశాల్లో ఇయర్ ప్లగ్స్ వాడాలని, చెవి సమస్యలు కనిపిస్తే వెంటనే వైద్యుడికి సంప్రదించాలన్నారు. వైద్యుల సలహా మేరకే మందులు వాడాలన్నారు. చెవులను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలని, సిఫార్సు చేసిన వినిడికి పరికరాలను మాత్రమే ఉపయోగించాలన్నారు. పిల్లలకు చెవినొప్పి, చెవిలో నుంచి నీరు కారడం లేదా చెవి మూసుకుపోతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. పిల్లలను మురికి నీటిలో ఈత కొట్టనివ్వరాదన్నారు. ఈకార్యక్రమంలో వినికిడి లోపంతో బాధపడుతున్న పిల్లలకు వినికిడి పరికరాలను అమర్చారు. ఈసందర్భంగా వినికిడి లోపం నివారణ కార్యక్రమ అధికారిణి డాక్టర్ పుర్ణిమ కత్తిమణి, జిల్లాకుష్టువ్యాధి నిర్మూలన అధికారి వీరేంద్రకుమార్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ విశ్వనాథ్ కిన్నాల్, డా.అనిల్‌రెడ్డి, డా.వినయ్, నర్సింగ్ సూపరింటెండెంట్ విమలాక్షి, జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఈశ్వర దాసప్ప, డా. విశాలాక్షి, డా.సురేశ్‌కుమార్, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దేశాయ్, జిల్లా ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వినికిడి యంత్రాన్ని అందజేస్తున్న సర్జన్ బసారెడ్డి



నిరసనలో నాగరిక పోరాట కమిటీ సభ్యులు

నగర సమస్యలు పరిష్కరించాలి

● నాగరిక పోరాట కమిటీ డిమాండ్ ● కార్పొరేషన్ ముందు నిరసన

బళ్లారి సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నగరంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బళ్లారి నాగరిక పోరాట కమిటీ డిమాండ్ చేసింది. పోరాట కమిటీ నేతృత్వంలో సోమవారం మున్సిపల్ కార్పోరేషన్ ప్రాంగణంలో నిరసన కార్యక్రమం నిర్వహించి. మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా కమిటీ కన్వీనర్ సోమశేఖర్ గౌడ మాట్లాడుతూ వేసవి కాలానికి అనుగుణంగా శుభ్రమైన తాగునీటిని అందించాలని, విద్యుత్ కోతల్లో జాప్యాలను నివారించడానికి ఎక్స్‌ప్రెస్ లైన్ ఏర్పాటు చేయాలని, వీధి కుక్కలు, వీధి పశువుల బెడదను నివారించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో పలు సమస్యలపై వారు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో కమిటీ సలహాదారుడు నరసప్ప, శ్యామ్‌సుందర్, సభ్యులు డా.ప్రమోద్, నాగరత్న, ఉమేశ్, ఆంథోని పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి సహకరించాలి

● బలిజ సంఘం నాయకుడు దేవినగర్ శ్రీనివాసులు పిలుపు



స్నేహ సమ్మేళనంలో పాల్గొన్న బలిజ సంఘం నాయకులు

బళ్లారి సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బలిజ సమాజంలోని ప్రతి వ్యక్తి బలిజ సమాజ పురోగతికి కృషి చేస్తే అందరి అభివృద్ధి సాధ్యమని బలిజ సంఘం నాయకులు దేవినగర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం నగరంలోని కెఎల్ కుమారస్వామి నివాసంలో దేవినగర్ శ్రీనివాస్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన బలిజ సమాజ స్నేహ సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజ బాంధవులు అందరూ కలిసి కట్టుగా సమాజ అభివృద్ధికి సహకరించాలన్నారు. తదుపరి బలిజ సంఘం నాయకుడు పటేల్ నగర్ రాజేశ్ మాట్లాడుతూ.. సమాజంలోని ప్రజలు ఐక్యంగా జీవించాలని పిలుపునిచ్చారు. దీని ప్రకారం బళ్లారి బలిజ సంఘం సీనియర్ నాయకులు యువత శ్రమించాలన్నారు. ఈసందర్భంగా బలిజ సంఘం నాయకుడు నారాయణ, జడ్పీ శ్రీరాములు, వేణుగోపాల్, బ్యాంక్ విజయకుమార్, రాజేశ్, రామకృష్ణ, శ్రీధర్, బంగారు రాజు, పరశురామ్, శివకుమార్, ఎర్రిస్వామి, హండేకార్ రాజేశ్, కేఎస్ఆర్‌టీసి చంద్రశేఖర్, జగన్నాథ్, అశోక్, రంగనాయకులు, తిమ్మప్ప, అనిల్, బలిజ సంఘం నాయకులు, యువనాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పచ్చని చెట్లను కాపాడుకుందాం..

బళ్లారిరూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని కప్పగల్ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు ఓంకారప్ప మండు వేసవిలో చెట్లకు నీరు పోస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎండా కాలం ప్రారంభం కావడంతో అడవి కొండ ప్రాంతంలో అప్పుడే చెట్లు ఎండిపోతున్నాయి. నిత్యం ఉదయాన్నే క్యాన్లతో గ్రామం నుంచి నీరు తీసుకువచ్చి వాటిని కాపాడుతున్నారు. ప్రతిఒక్కరూ తొట్టెలు ఏర్పాటు చేసి నీరు పోయాలని, పక్షులను, పశువులను కాపాడాలని సూచిస్తున్నారు.



మొక్కకు నీరు పోస్తున్న ఓంకారప్ప

సీనియర్ పాత్రికేయుడికి అవార్డు ప్రదానం

బళ్లారి సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బళ్లారి సీనియర్ పాత్రికేయుడు గురుశాంతకు కర్ణాటక వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ స్పెషల్ అవార్డు అందజేసింది. ఆయన 29సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతితోపాటు పలు వార్తాపత్రికల్లో పనిచేశారు. ఆయన సుదీర్ఘ సేవలను గుర్తింపుగా అసోసియేషన్ 2024-25 సంవత్సరానికి గాను కొప్పళ నగరంలోని పానగంటి కల్యాణ మంటపంలో అవార్డు అందజేశారు. ఈసందర్భంగా జిల్లా కన్నడ , సాంస్కృతిక శాఖ ఇన్‌చార్జ్ మంత్రి శివరాజ్ తంగడి, సీఎం మీడియా సలహాదారుడు కే.ప్రభాకర్, కానిపా రాష్ట్ర అధ్యక్షుడు శివానంద తగడూర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకేశ్,స్థానిక ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్ పాల్గొన్నారు.



అవార్డుతో గురుశాంత్

ఉచిత కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్లు చేయించుకున్న వృద్ధులు

కంప్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పట్టణాల్లో సంఘ సంస్థలు ప్రజాప్రతినిధులు చేపట్టే ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కూడ్లిగి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీనివాసులు తెలిపారు. తమ నియోజకవర్గంలోని తామంతా సీనియర్ సిటీజన్లకు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి అవసరమైనన వైద్యాన్ని విజయవంతంగా పూర్తి చేశామన్నారు. జరిగిన కార్యక్రమంలో వృద్ధులకు నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. వంద మందికి పైగా కంటి చికిత్స కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఫిజియోథెరపీ..



కంప్లి పట్టణంలో వాల్మీకి సర్కిల్ బళ్లారి రోడ్డు సంజీవిని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్న ఫుట్ పల్స్ ఫిజియోథెరపీ చికిత్సను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కృష్ణకుమార్ తెలిపారు. దీనివల్ల బాడీ పెయిన్స్, నరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, రక్త సరఫరా సక్రమంగా శరీరంలో ఎందుకు ఫుట్ ఫిజియోథెరపీ ఉపయోగపడుతుందన్నారు. ఈ నెల 19 వరకు చికిత్స నిర్వహిస్తామని వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫిజియోథెరపీ అందిస్తున్న వైద్యులు

హోసూరు జోన్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వై ప్రకాశ్

గ్రామీణ రోడ్ల పనులకు శ్రీకారం

హోసూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హోసూరు నియోజకవర్గ పరిధిలోని హోసూరు పంచాయతీ యూనియన్ ఈచంగూరు పంచాయతీలో ముఖ్యమంత్రి గ్రామ రోడ్ల పథకం క్రింద సొక్కనాథపురం నుంచి దాసిరపల్లి వరకు రూ.87 లక్షలతో తారురోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వై ప్రకాశ్ శ్రీకారం చుట్టారు. బాగలూరు-బేరికై రోడ్డు నుంచి సత్యమంగలం వరకు, తుమ్మనపల్లి పంచాయతీ రూ.47 లక్షలతో బడుదేపల్లి పంచాయతీ గ్రామంలో అన్ని గ్రామాల పునరుజ్జీవన పథకం క్రింద రూ.14.31 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శులు గజేంద్ర మూర్తి, నాగేశ్, యూనియన్ ఉప కార్యదర్శులు వీరభద్రప్ప, రమేశ్, కూసనపల్లి శేఖర్, సత్యమంగలం, వెంకటప్ప, రాజన్న డీఎంకే ఇన్‌చార్జ్‌లు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కార్మిక నాయకులను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ ఆనందయ్య

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం: డిప్యూటీ మేయర్

హోసూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని డిప్యూటీ మేయర్ ఆనందయ్య హామీ ఇచ్చారు. హోసూరులో సేలం మండలం పాలదండయుతం కన్‌స్ట్రక్షన్ అండ్ నాన్ ఆర్గనైజ్డ్ వర్కర్స్ యూనియన్ ఎగ్జిక్యూటివ్‌ల సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి డిప్యూటీ మేయర్ ఆనందయ్య, కార్తీక్ శ్రీనివాసన్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. సేలం మండల ఉపాధ్యక్షుడు శబరీశన్ ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ బాణసంచా దుకాణంలో కార్మికులు, పెయింటర్, కార్పెంటర్, మేస్త్రీ, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, డ్రైవర్లతో పాటు అసంఖ్యాక వృత్తిదారులకు తగిన రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు, ఈ పథకం క్రింద నమోదు చేసుకుంటే అన్నిఆసుత్రుల్లో ఉచితంగా వైద్యం పొందవచ్చునన్నారు. టైలర్స్ అసోసియే షన్ సభ్యులు, సురేశ్, తిరుపతి, లక్ష్మణన్, రామసుందరం, ఆర్మగం, కుమార్, మునిరాజు, సత్యరాజు, రామసుందరం, ఆరుముగం, కుమార్, మునిరాజు, సత్యరాజు, వెంకటాచలం, దయానిధి, లోకనాథన్, వెంకటేశ్, జ్యోతిమణి పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేయాలని వినతి

హోసూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): దిన్నూరు ప్రాంతంలో పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సబ్ సబ్‌కలెక్టర్‌కు గిరిజనుల బృందం సోమవారం వినతిపత్రం సమర్పించారు. హోసూరు ఆల్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 50 మందికి పైగా మహిళలు, పురుషులు పాల్గొని తమ సమస్యలను విన్నవించారు. హోసూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారి కామాక్షికి వినతి పత్రాన్ని అందజేశారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన బృందం

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి సోమవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. మృతుడి మెడలో జంధ్యం ఉందని, వయసు సుమారు 30 ఏళ్లు ఉంటుందని తెలిపారు. అతన్ని గుర్తించేందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.